క్లుప్తంగా

ఆత్మవిశ్వాసం తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: ఆడ పిల్లలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ తెలిపారు. సోమవారం స్థానిక తోట పాలెం ఎంపీపీ స్కూల్‌లో చిరుధాన్యాల ఉపయోగంపై వ్యాసరచన పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిరుధాన్యాలు చూడడానికి చిన్నవైనా వాటిలో ఉన్న పోషక విలువలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చిరుధాన్యాల ఆహారాన్ని తినాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.మహేశ్వరరావు, నారాయణరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, మంగ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో 'స్పందన'



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ బంగారయ్య మాట్లాడుతూ, ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ జేఈ చంద్రునాయుడు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు జొన్నాడ విద్యార్థి ఎంపిక



విద్యార్థి భానుప్రకాష్‌ను అభినందిస్తున్న ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు

డెంకాడ: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెనుమత్స భానుప్రకాష్ ఎంపికయ్యాడు. దీంతో భానుప్రకాష్‌ను హెచ్ఎం జి.లక్ష్మి, సర్పంచ్ కోరాడ రమణి, గ్రామపెద్దలు కోరాడ కోటినాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మురళి, పాఠశాల కమిటీ చైర్మన్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


ముక్కాంలో అగ్ని ప్రమాదం



కాలిపోతున్న ఇల్లు

భోగాపురం: మండలంలోని ముక్కాంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గుంటు గరగమ్మకు చెందిన పూరిల్లు కాలిబూడిదైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదంలో రూ. 20 వేల నగదు కాలిపోవడంతో బాధితురాలు లబోదిబోమని రోధిస్తోంది. విషయం తెలుసుకున్న వీఆర్వో లక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో నగదుతో పాటు సుమారు రూ.30 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

తంగుడుబిల్లిలో ఆధ్యాత్మిక సందడి



నాగ ప్రతిమకు పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లిలో సోమవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా స్థానిక శివాలయంలో నాగ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నింటి చిన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, నాయకులు పాలూరి తిరుపతిరావు, కురిమినేని రాజేశ్వరరావు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం

విజయనగరం క్రైమ్: వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రైల్వే జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు (విశాఖ) అన్నారు. స్థానిక జీఆర్‌పీ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది కలిసి ట్రైన్ బీట్‌లు, ప్లాట్‌ఫామ్ విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్, జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ధ్యేయం

● నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



హాజరైన అధికారులు

విజయనగరం: నగరాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ విజయలక్ష్మి అజెండాలోని అంశాల వారీగా సభ్యుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన 45 అంశాలను పొందుపరిచామన్నారు. కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, సభ్యుల సూచనలు, సలహాలు మేరకు నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పట్నాన పైడిరాజు, బి.ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరం



మాట్లాడుతున్న వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు జీవీబీ జగదీష్

విజయనగరం అర్బన్: విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారతా మంత్రిత్వ శాఖ, కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో 'చెడువ్యసనాలు వాటి ప్రభావం' అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మద్యపానం, ధూమపానం మొదలైన చెడు వ్యసనాలకి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వ్యసనపరులను గుర్తించి, వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకే ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, ఎస్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జి.చంద్రశేఖరరావు, పీఓలు డాక్టర్ పీఎస్‌బీ శర్మ, సీహెచ్ చిన్నంనాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ. కల్యాణ్‌అశోక్, కళాశాల అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు

భోగాపురం: ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఆటో ఢీకొనడంతో పలువురు గాయపడిన సంఘటన సోమవారం రాత్రి భోగాపురం జాతీయ రహదారి పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సవరవిల్లి సంత నుంచి ఒక వ్యక్తి ఆటోలో అరటిగెళ్లతో పాటు ప్రయాణికులను ఎక్కించుకుని పూసపాటిరేగ మండలం రెట్టివలస బయలుదేరాడు. అదే సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న బొలెరో వాహనం డ్రైవర్ భోజనం చేసేందుకు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డులో వాహనం నిలిపాడు. ఇది గమనించని ఆటో డ్రైవర్ నేరుగా బొలెరో వాహనాన్ని ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న కె.రామలక్ష్మి, పి.పైడమ్మ, ఎ.పైడిరాజుతో పాటు మరో నాలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సుందరపేట సీహెచ్‌సీకి, విజయనగర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పెరటికోళ్ల పంపిణీ



మహిళలకు పెరటి కోళ్లు అందజేస్తున్న నాయకులు, వెలుగు సిబ్బంది

మెరకముడిదాం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు స్థానిక వెలుగు కార్యాలయంలో మాజీ ఎంపీపీ తాడ్డి వేణుగోపాలరావు, మాజీ జెడ్పీటీసీ కోట్ల విశ్వేశ్వరరావు, నాయకులు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పెరటికోళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఏపీఎం లెంక కామేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న రుణసదుపాయాలు, పథకాలను సద్వినియోగించుకుని మహిళలు చిరువ్యాపారాలు చేసేకుంటూ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'చలో పార్లమెంట్'లో పాల్గొనాలి



ఆందోళన చేస్తున్న హమాలీలు

నెల్లిమర్ల: కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం వచ్చే నెల 5న చేపట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూఎస్ రవికుమార్, నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా స్థానిక ఏపీ బేవరేజస్ గోదాం వద్ద కలాసీలతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. కనీస వేతనం రూ. 26వేలు, కనీస పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కలాసీ సంఘ నాయకులు రామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే 'స్పందన'



దత్తిరాజేరు: వినతులు స్వీకరిస్తున్న మండల అధికారులు



బొండపల్లి: అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు



గజపతినగరం: అధికారులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శనం

దత్తిరాజేరు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపిడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు అందాయని ఆయన చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలోని 35 గ్రామాల ప్రజలూ ఏసమస్య ఉన్నా నేరుగా కార్యాలయానికి వచ్చి అర్జీలు అందించవచ్చని సూచించారు. అన్ని శాఖల మండల అధికారులు ప్రతీ సోమవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటు లో ఉండి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటికి పరిష్కారం చూపిస్తారని చెప్పారు. వైద్యాధికారి సతీష్, ఏపీఎం, అచ్యుతరావు, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'పై ప్రజలకు అవగాహన కల్పించండి

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పంద న నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, ప్రజాసమస్యలను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూజ్ రాయ్, కె.పుష్పాంజలి, తుమికాపల్లి, మరుపల్లి వెటర్నరీ డాక్టర్‌లు శశిభూషణ్‌రావు, వెంకటరమణ, ఉద్యానవన,వ్యవసాయ,తదితర శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు మెమోలు జారీ

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి తరచూ హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయడంతో పాటు వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీఓ ఏ.వేదవతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. రయింద్రాం గ్రామానికి చెందిన రైతు కిలపర్తి చిన్నంనాయుడు తనకు రైతు భరోసా అందడం లేదని వినతి పత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని ఏఓ మల్లికార్జునరావుకు ఎంపీడీఓ సూచించారు.తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొత్తవలస: మండల కేంద్రంలోని సబ్బవరం రోడ్డులో గవరపాలెం, మిందివలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొంటారని, కార్యక్రమానికి మండల అధికారులు, ఆయా ప్రాంతాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

29 నుంచి శంకుస్థాపన వారోత్సవాలు

● ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో అదే స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ నెల 29 నుంచి శంకుస్థాపన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అసెంబ్లీ సమావేశాల కారణంగా నగరంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నూతనంగా చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా వచ్చేనెల 6 నుంచి వారం రోజుల పాటు ఇప్పటికే పూర్తియిన అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా ప్రాంత ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తకుండా కార్పొరేషన్ పరంగా చర్యలు చేపడుతున్నామని, ఇదే క్రమంలో ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. నగరంలోని పాత కుళాయిలతో పాటు చాలా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొత్త కుళాయిలకు ట్యాప్‌లు బిగించుకోవాలన్నారు. ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమిపై సమీక్షించుకుంటున్నామని, ఓటమి గల కారణాలను అన్వేషించి ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. అదేవిధంగా నగరం నడిబొడ్డున మహిళల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును వచ్చే నెలలో మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

రంగస్థల కళాకారులకు ఆర్థిక సాయం



సత్కారం పొందిన రంగస్థల కళాకారులతో నిర్వాహకులు

విజయనగరం: ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా 'గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్' సంస్థ ఆధ్వర్యంలో ముగ్గురు రంగస్థల కళాకారులను సోమవారం సాయంత్రం సత్కరించి, ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక కోట జంక్షన్ వద్ద గల ఆనంద్ ఎన్‌క్లేవ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బేల పద్మశ్రీ, రాజు, కర్రోతు జగ్గారావులను సత్కరించి, ఒక్కొక్కరికీ మూడు వేల రూపాయల చొప్పున నగదు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధిక మంగిపూడి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేఆర్‌కే రాజు, కుటుంబరావు, ఝాన్సీ, రుక్మిణి, సంగీతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనుల పరిశీలన



సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లిరూరల్: మండలంలోని పత్తికాయవలస గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూరీసర్వే పనులను తహసీల్దార్ ఎం.సురేష్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా రెవెన్యూ, సర్వే సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. పక్కాగా, పారదర్శకంగా సర్వే చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూరీసర్వే కార్యక్రమాన్న సద్వినియోగం చేసుకోవాలని, సిబ్బంది సర్వే చేసే సమయంలో పొలాల వద్ద ఉండి సహకరించాలని రైతులను కోరారు. భూసమస్యలను పరిష్కరించేందుకే సమగ్ర భూరీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సర్వేయర్లకు సూచించారు.

ఎస్సీ రిజర్వేషన్ల తీర్మానం నిలిపివేయాలి



ఆర్డీఓ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రచారక్‌లు

చీపురుపల్లి: దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చేసిన తీర్మానం నిలిపివేయాలని విశ్వ హిందూ పరిషత్ చీపురు పల్లి, గరివిడి మండలాల ప్రచారక్‌లు ప్రేమ్‌కుమార్ వర్మ, శంకరరావు కోరారు. ఈమేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మత మార్పిడికి ప్రోత్సహిస్తున్నట్లు అవుతుందన్నారు. అందుకనే ఈ తీర్మానాన్ని నిలిపివేయాలని కోరారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

● వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఇతర ప్రజా ప్రతినిధులు



హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

కొత్తవలస: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులను సీఎం జగన్ తాజాగా విడుదల చేసిన సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాలకు 2019 ఎన్నికల నాటికి ఉన్న రుణం మొత్తాన్ని నాలుగు విడతల్లో అందిస్తామని ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చినమాట ప్రకారం ఇప్పటి వరకు సీఎం జగన్ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలకు రూ.19,178 కోట్లు అందజేశారని చెప్పారు. ఎస్.కోట నియోజకవర్గంలోని అక్క,చెల్లెమ్మలకు బాసటగా మూడు విడతల్లో రూ.155 కోట్లు జమ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వివిధ పథకాల ద్వారా ఎస్.కోట నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.1,000 కోట్లు నేరుగా జమయ్యాయని అన్నారు. 2014 ఎన్నికల సమయంలో మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబునాయుడు మాయమాటలు చెప్పి మహిళలతో ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలను నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయం వస్తోందని మళ్లీ మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు టీడీపీ పగటి వేషగాళ్లు వస్తారని, వారికి మీరే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆయన్ని ప్రతీ అక్క,చెల్లమ్మ దీవించాలని కోరారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ప్రతీ కుంటుంబానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థిరమైన ఆస్తిని అందిస్తున్నారని తెలిపారు. అనంతరం మూడోవిడత ఆసరా చెక్కు అక్కచెల్లమ్మలకు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల కన్వీనర్ బొంతల వెంకటరావు, సర్పంచులు మచ్చ ఎర్రా రామస్వామి, విరోతి కొండలరావు, పీతల కృష్ణ, పార్టీ నాయకులు మదీన అప్పలరమణ, పి.ఎస్.ఎన్. ప్రాత్రుడు, రామన్నపాత్రుడు, ఎంపీడీఓ వై.పద్మజ, వెలుగు ఏపీఎంలు శ్రీనివాసరావు,రొంగళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్.కోటలో..

లక్కవరపుకోట మండల కేంద్రంలోని చెరుకు కాటా వద్ద వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలంతా తరలిరావాలని కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతల్లో రుణ మాఫీ డబ్బులు అందిస్తామని ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి అయిన తర్వాత నిలబెట్టుకున్నారు. ఏడాదికి రూ.10,300 చొప్పున ఇప్పటి వరకు మూడు విడతల్లో నా ఖాతాలో రూ.30,900 జమయింది. ఈ సొమ్ముతో పాటు ప్రభుత్వం ప్రోత్సాహంతో ఎలక్ట్రానిక్స్ షాపును పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– కదాలి లక్ష్మి, కుమ్మరవీధి, కొత్తవలస మండలం

రుణపడి ఉంటాం..



జగనన్న ఇప్పటి వరకు ఆసరా పథకంలో భాగంగా ఒక్కో విడతలో రూ. 11,600 చొప్పున మూడు విడతల్లో నాఖాతాలో రూ.34,800 జమయ్యాయి. ప్రస్తుతం పూజా సామగ్రి షాపు పెట్టుకున్నాను. స్వయం ఉపాధి కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం. – బి.స్వర్ణలత,కొత్తవలస

ఆర్థిక భరోసా దక్కింది



ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ నిధులను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. నాకు మూడు విడతల్లో ఆసరా పథకం డబ్బులు రూ.51,150 వచ్చాయి. ఈ సొమ్ముతో టైలరింగ్ షాపు నడుపుతున్నాను. మాకుటుంబానికి ఆర్థిక భరోసా దక్కింది.

– కె.కళావాణి, 202–కాలనీ,కొత్తవలస మండలం